# అభద్రత అంచున.....

చాలా మంది ధనధాన్యాలుంటే సుఖ సంతోషాలుంటాయని అనుకుంటారు. నిజానికి అవి లేని వాళ్ళే అలా అనుకుంటారు. అది తప్పుడు ఆలోచన అని మన పెద్దలకు ఎప్పుడో తెలుసు. అందుకే వాళ్ళు "ధనధాన్యాలతో చల్లగా ఉండండి" అని మాత్రమే పిల్లల్ని ఆశీర్వదించేవాళ్ళు కారు."సుఖ సంతోషాలతో ధనధాన్యాలతో నూరేళ్ళు చల్లగా బతకండి" అని ఆశీర్వదించేవాళ్ళు. పెద్దల ఆ ఆశీర్వచనంలో సుఖ సంతోషాలతో బతకడానికి ధనధాన్యాలుండాలనే భావం వుంది. అయితే, ధనధాన్యాలుంటేనే సుఖ సంతోషాలుంటాయనే అభిప్రాయం లేదు. ఆ రెండూ ఉన్నా నూరేళ్ళూ చల్లగా బతకవచ్చుననే హామీ లేదు. అంచేతనే పెద్దలు అంత వివరంగా ఆశీర్వదించే వారేమో! అంత వివరంగా చేసే ఆశీర్వచనంలో భయాందోళనలు లేకుండా బతకండని లేదు. అంటే అభద్రతా భావం గురించిన బెంగ అప్పట్లో వాళ్ళకంతగా లేదేమో!



అభద్రతా భావం అప్పట్లో లేదని అనుకోవడానికి లేదు. సీత మనసులో అభద్రతా భావం లేకపోవచ్చు. తనను సర్వవేళలా సంరక్షించే భర్త శ్రీరాముడు తన చెంత ఉన్నాడనే ధైర్యంతో ఆమెకు అభద్రతా భావం లేకపోవచ్చు. కానీ, ఆ అడవిలో అభద్రత ఉందనే ఆలోచన లక్ష్మణుడిలో ఉంది. అంచేతనే, బంగారు లేడిని పట్టుకోడానికి రాముడు వెళ్ళి, 'హా లక్ష్మణా' అని కేకవేసినప్పుడు "వెంటనే వెళ్ళు" అని సీత ఎంత తొందరపెట్టినా లక్ష్మణుడు గబుక్కున పరుగు పెట్టలేదు. సీతను ఒంటరిగా వదిలివెళ్తే ఆమెకు భద్రత వుండదేమో అని లక్ష్మణుడు అనుమానించాడు. కుటీరం ముందు ఓ రేఖ గీసి, అది దాటి రావద్దని లక్ష్మణుడు సీతను హెచ్చరించాడు. అతను గీసిన 'లక్ష్మణరేఖ'ను సీత దాటింది. అలా సీత లక్ష్మణరేఖను దాటడానికి కారణం ఆమెలో అభద్రతాభావం లేకపోవడం కావచ్చు. లేదా అభద్రతా భావం ఉండీ నాటి సంప్రదాయాలను కాదనలేకపోయి వుండొచ్చు. సీతలో అభద్రతా భావం ఉన్నా లేకున్నా అలనాటి సమాజంలో కూడా అది ఉందని రావణాసురుడు నిరూపించాడు. సీతను ఎత్తుకెళ్ళి సార్థక జాతుడు అనిపించుకున్నాడు.

వీరాధివీరులైన అయిదుగురు భర్తలుండీ ద్రౌపదికి భద్రత లేకపోయింది. ఆ అయిదుగురు భర్తల ముందే తన తొడమీద కూర్చోమని దుర్యోధనుడు ద్రౌపదిని ఆదేశించాడు. దుశ్శాసనుడు వీరాధివీరులైన ఆ అయిదుగురు భర్తల ముందే ద్రౌపదీ వస్త్రాపహరణం చేశాడు. శ్రీకృష్ణుడే అప్పుడు ఆదుకుని ఉండకపోతే... కుల వివక్షతతోనో, పోలీసు జులుంతోనే మన రాష్ట్రంలో వివస్త్రను చేసి వీధుల్లో నడిపించగా తలొంచుకుని వెళ్ళిన ఏ ఎల్లమ్మో పుల్లమ్మో అయి ఉండేది ద్రౌపది!

అభద్రత ఒక్క స్త్రీలకే ఉందనుకుంటే అది పెద్ద తప్పు. ఎక్కడైనా ఉందేమో కానీ లింగ వివక్షత అభద్రతలో లేదని ఎన్నో దుర్ఘటనలు నిరూపించాయి.

అజేయుడైన వాలి, సుగ్రీవుడితో పోరాడుతున్నప్పుడు అక్కడ అభద్రత ఉందని వెనకనుంచి చాటుగా రాముడు వదిలిన బాణం గుచ్చుకున్న తర్వాతకానీ అతనికి తెలియలేదు. అదీ తనకేమాత్రమూ వైరం లేనివాడు చాటుమాటున తన మీదకు బాణం సంధించడంతో దిగ్భ్రాంతి చెందిన వాలి నేలమీదకు వాలిపోతూ "ఎంత పని చేసితివి రామా, నిన్ను ఏమందును సార్వభౌమా'' అని వాపోయాడు. ధర్మయుద్ధానికి పేరుమోసిన శూరాధిశూరులు పన్నిన పద్మవ్యూహంలో అభద్రత వుందని అభిమన్యుడు అణుమాత్రం కూడా అనుమానించలేదు. ఒక్కడితో ఒక్కడు మాత్రమే పోరాడాలనే నాటి యుద్ధధర్మాన్ని గాలికొదిలి ఆ శూరాధిశూరులందరూ అభిమన్యుడిని 'చిత్రవధ' చేశారు.

జూలియస్ సీజర్ క్లియోపాత్ర వ్యామోహంలో పడి ఆమె ఆడించినట్టల్లా ఆడుతున్నాడనే ఒక నెపంతో అతని మంత్రివర్గ సభ్యులు నిండు సభలోనే కత్తులతో పొడిచి చంపేదాకా అక్కడంత అభద్రత రాజ్యమేలుతోందని అతనికి తెలియలేదు. తనను కత్తులతో పొడిచి చంపినవాళ్ళలో ప్రియమిత్రుడు కూడా ఉండడం చూసి అమితాశ్చర్యంతో "యూ టూ బ్రూటస్'' అంటూ ప్రాణాలు వదిలాడు. తాజ్‌మహల్‌ను నిర్మించిన షాజహాన్‌కు తన కోటలోనే అభద్రత వుందని తన కొడుకు ఔరంగజేబు, అన్నదమ్ముల్ని చంపి తనను జైల్లో పెట్టే వరకూ తెలియలేదు.

తెల్లదొరల నుంచి దేశానికి స్వాతంత్ర్యం సంపాదించడానికి సాయుధ పోరాటంచేస్తూ బ్రిటిష్ సైన్యం తుపాకీ గుళ్ళకు బలయిన విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజుకు అక్కడ అభద్రత వుందని తెలుసు.

అందరికీ భద్రత ఉండే సమసమాజం కోసం సాయుధ పోరాటం చేసి, ప్రాణాలర్పించిన సుబ్బారావు పాణిగ్రాహికీ వెంపటాపు సత్యానికీ పంచాద్రి నిర్మలకూ ఈ దేశంలో ఎన్‌కౌంటర్ల అభద్రత వుందని తెలుసు. వేలాది మంది కళ్ళముందే- ఎవరి మేలు కోసం త్యాగాల బాటలో నడుస్తున్నాడో అలాంటి వాళ్ళ ముందే తనకు భద్రతలేదని పోలీసుల కాల్పుల్లో మరణించిన రమాకాంత్‌కు తెలుసు. గజ్జెకట్టి కర్రపట్టి ఆగ్రహ స్వరంతో "మము చంపుకున్నా మీ దయే, మము ఆదుకున్నా మీ దయే'' అంటూ విప్లవగీతాలాలపిస్తూ లక్షలాది జనాన్ని కదిపి కుదిపిన ప్రజా గాయకుడు గద్దర్‌కు అభద్రత వుందని తెలిసినా తన ఇంటి దగ్గరకే అది కదిలి వస్తుందని తెలీదు!

రామానాయుడు స్టూడియోలో శ్రీరాములయ్య సినిమా ప్రారంభోత్సవ సమయంలో అక్కడంత అభద్రత దాగివుందని బాంబులు పేలేదాకా ప్రాణాలు కోల్పోయిన వారెవరికీ తెలీదు. ఇక ముఠాకక్షలతో మూలిగే రాయలసీమలో అభద్రత రాజ్యమేలుతోందని తెలియని నాయకులెవరూ అక్కడలేరు.

ఒక ప్రాంతంలో ఎక్కువ కావచ్చు. మరొక ప్రాంతంలో తక్కువ కావచ్చు. కాశ్మీర్‌లోనూ కుందుర్రులోనూ అభద్రత అవిచ్ఛిన్నంగా కొనసాగుతోంది. ఇలాంటి అభద్రతా రాజ్యంలో తన భద్రతకోసం నిత్యం తాపత్రయపడే పెనుగొండ ఎమ్మెల్యే పరిటాల రవీంద్ర హైద్రాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టుకు, వచ్చే నెల ఇరవై ఒకటో తేదీన హాజరుకావడానికి అదనపు భద్రత కల్పించాల్సిందిగా న్యాయమూర్తి ఆదేశించాడు. ఒక ఎస్.ఐ.తోనూ, పదిమంది సాయుధ పోలీసులతోనూ అదనపు భద్రత కల్పించాలన్నాడు. మంచిదే.

అయితే, అభద్రతతో అతలాకుతలమైపోతున్న ఈ రాష్ట్రానికి, ఈ దేశానికి భద్రతో, అదనపు భద్రతో కల్పించాలి. ఎవరు కల్పిస్తారు? ఆ రోజొస్తుందా? రావాలి. ఆ రోజు తప్పక రావాలి.

18.9.98, వార్త దినపత్రిక,